నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం




# సొసైటీలో బీమారి!

**రూ.50 వేల నుంచి రూ.2 లక్షలకు మారిన బీమాపై రగడ**

**ఐదు నెలల నుంచి అనేక వివాదాలను మూటగట్టుకుంటున్న డీసీసీబీ**

**పాలకవర్గం వర్సెస్ బ్యాంకు అధికారులు**

**సీఈవోవి ఏకపక్ష నిర్ణయాలంటున్న పాలకవర్గం**

**కీలకం కానున్న ఈ నెల 5వ తేదీన జరిగే సమావేశం**




ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

ఖమ్మం, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో రైతులకు రూ.2 లక్షల బీమా పథకం వ్యవహారం రగడ సృష్టిస్తున్నది. బోర్డు మీటింగ్‌లో చర్చించి బీమా పథకంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా.. డీసీసీబీ చైర్మన్ దృష్టికి వెళ్లకుండానే సీఈవో టెండర్ల ప్రక్రియ, ఇన్సరెన్స్ కంపెనీల ఎంపిక పూర్తి వరకు తీసుకొచ్చారని పలువురు డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతున్న ఈ వ్యవహారం నాలుగు జిల్లాల పీఏసీఎస్ బాధ్యులను ఇబ్బంది పెడుతున్నది. ఖమ్మంలోని జిల్లా బ్యాంకులో శనివారం జరిగిన సబ్ కమిటీ సమావేశంలో ఇదే ప్రధాన ఎజెండాగా మారినట్లు తెలుస్తున్నది. ఖమ్మం డీసీసీబీ.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతోపాటు మహబూబాబాద్, ములుగు జిల్లాలకు విస్తరించింది. దీని పరిధిలో 100 సహకార సంఘాలు ఉండగా.. మరో 50 డీసీసీబీ బ్రాంచీలు రైతులు, ఖాతాదారులకు విస్తృత సేవలు అందిస్తున్నాయి. అయితే గత ఐదు నెలల నుంచి డీసీసీబీ వ్యవహారం నిత్యం అనేక వివాదాలను మూటగట్టుకుంటున్నది. బ్యాంకు ప్రతిష్టను మసకబారే స్థితికి తీసుకొస్తున్నది. ఇదే పాలకవర్గంలో చైర్మన్‌గా పనిచేసిన కూరాకుల నాగభూషణంపై వీవీపాలెం సొసైటీలో అవిశ్వాస తీర్మానం పెట్టడం వల్ల ఆయన సొసైటీ చైర్మన్‌తోపాటు డీసీసీబీ చైర్మన్ పదవిని కోల్పోయారు. దీంతో బ్యాంకు ఉపాధ్యక్షుడిగా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా.. గత మార్చి నెలలో డీసీసీబీ జనరల్ బాడీ సమావేశం(మహాజన సభ) జరిగింది. దీనికి హాజరైన సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు సొసైటీలలో సభ్యత్వం కలిగిన రైతులకు ప్రస్తుతం ఉన్న రూ.50 వేల బీమాను రూ.2 లక్షల వరకు వర్తింపజేయాలని కోరారు. అప్పుడే 11వ తీర్మానంగా రూ.2 లక్షల వరకు రైతులకు బీమా కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

### 5న జరిగే సమావేశం కీలకం

డీసీసీబీ బోర్డు సమావేశం ఈ నెల 5న చైర్మన్ అధ్యక్షతన జరగనున్నది. గడిచిన నాలుగైదు నెలల నుంచి డీసీసీబీలో జరుగుతున్న ప్రతి వ్యవహారంపై చర్చ జరిగే పరిస్థితి కనిపిస్తున్నది. కొత్త చైర్మన్, డైరెక్టర్ల ఎంపికకు తీర్మానం చేసే అవకాశం కూడా ఉంది. అంతేకాక బ్యాంకు ఉన్నతాధికారులు పాలకవర్గాన్ని పట్టించుకోవడం లేదనే అభిప్రాయం ఉన్నందున వారిపై చర్యలు చేపట్టాలని తీర్మానం చేసే అవకాశం కూడా ఉంటుందని పాలకవర్గ సభ్యుల ద్వారా తెలుస్తున్నది. ఏదేమైనా మరో ఐదు రోజుల్లో డీసీసీబీలో జరగబోయే బోర్డు సమావేశం అత్యంత కీలకంగా మారబోతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

### డీసీసీబీ పాలకవర్గం వర్సెస్ అధికారులు

నాటి డీసీసీబీ చైర్మన్ పదవి కోల్పోయిన తర్వాత కొత్త అధ్యక్షుడిగా దొండపాటి వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలోనే పాలకవర్గ సభ్యులు వర్సెస్ చైర్మన్ వర్గాలుగా విడిపోయారు. ఖాళీగా ఉన్న డీసీసీబీ డైరెక్టర్ల ఎన్నిక, నూతన చైర్మన్ ఎంపికకు బోర్డు మీటింగ్‌లో తీర్మానం చేయాలని మెజార్టీ డైరెక్టర్లు పట్టుబట్టడం, వారి అభ్యంతరాలను పక్కదోవ పట్టించడం పరిపాటిగా మారింది. మూడు వరుస సమావేశాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపించింది. దీంతో డీసీసీబీ పాలకవర్గంలో తీవ్ర పొరపొచ్చాలు వచ్చాయి. అయితే డీసీసీబీలో నెల రోజుల నుంచి ఇందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తున్నది.. ప్రస్తుత పాలకవర్గం వర్సెస్ బ్యాంకు యంత్రాంగంగా ముఖచిత్రం మారింది. దీంతో సీఈవో తీసుకుంటున్న అనేక నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటున్నాయని చైర్మన్ బహిరంగంగానే తప్పుబడుతున్నారు. ఉద్యోగుల పదోన్నతుల నుంచి రైతుల బీమా సౌకర్యం అమలు వరకు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. రూ.2 లక్షల బీమాకు తాము వ్యతిరేకం కాదని, కాకపోతే బోర్డు మీటింగ్‌లో మరోసారి చర్చించి కార్యాచరణ చేపట్టాల్సి ఉంటుందంటున్నారు. అయితే దీనికి భిన్నంగా సీఈవో రెహమాన్ టెండర్ల ప్రక్రియ, ఇన్సూరెన్స్ కంపెనీల ఎంపిక పూర్తి వరకు కనీసం చైర్మన్ దృష్టికి తీసుకురాలేదని వాపోతున్నారు. ఇలా అనేక నిర్ణయాలను అధికారులు బైలా ప్రకారం చేస్తున్నారా.. లేదా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారా.. అనేది రాష్ట్ర టెస్కాబ్ అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది.

## పారదర్శకంగా బీమా సంస్థల ఎంపిక

**డీసీసీబీ సీఈవో రెహమాన్**



ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 31 : సొసైటీల సభ్యులకు బీమా చేయించేందుకు బీమా సంస్థల ఎంపిక అత్యంత పారదర్శంగా జరిగిందని డీసీసీబీ సీఈవో అబ్దుల్ ఉర్ రెహమాన్ తెలిపారు. శనివారం డీసీసీబీలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఆగస్టు నెలతో పాలసీ వ్యవధి ముగుస్తున్నందున సొసైటీల నుంచి రైతుల జాబితా తెప్పించడం జరిగిందన్నారు. తక్కువ కోడ్ చేసిన ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఒక్కో రైతుకు రూ.646తో ముందుకు రావడంతో వారికి అవకాశం కల్పించామన్నారు. ఈ నిర్ణయం బీమా కంపెనీలు, బ్యాంకు అధికారుల సమక్షంలోనే జరిగిందన్నారు. ఉద్యోగ బదిలీల ప్రక్రియలో సైతం ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియ పూర్తి చేశామన్నారు.

# 28న జాతీయ లోక్ అదాలత్

**ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్**




మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్, ఆగస్టు 31 : జిల్లావ్యాప్తంగా ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఖమ్మం జిల్లా జడ్జి జి.రాజగోపాల్ పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్‌పై తీసుకోవాల్సిన చర్యలు, న్యాయాధికారులతో ఖమ్మం నగరంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వాస్తవానికి ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించాల్సి ఉందని, అయితే గణేశ్ ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఈ నెల 28వ తేదీకి మార్చినట్లు ఆదేశాలు జారీ చేసిందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో కంటే ఈసారి ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ‘భగీరథ’ ఉద్యోగుల విధుల బహిష్కరణ

**ఐదు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్**



కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పర్ణశాల, ఆగస్టు 31 : కాంట్రాక్టర్ తమకు రావాల్సిన ఐదు నెలల వేతనాలు చెల్లించడం లేదని, అధికారులు కూడా దీని గురించి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ పర్ణశాల మిషన్ భగీరథ ఉద్యోగులు శనివారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ తమ వేతనాల గురించి కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే.. నాకు 18 నెలలుగా ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని, అందుకే వేతనాలు సకాలంలో చెల్లించలేకపోతున్నామని చెబుతున్నాడని అన్నారు. వేతనాలు సక్రమంగా రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, తమ పరిస్థితిని అర్థం చేసుకుని ప్రజలు సహకరించాలని ఉద్యోగులు కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఉద్యోగులు పవన్‌కుమార్‌రెడ్డి, దాస్, అశోక్, శ్రీను, సాయిచందు, శ్రీకాంత్, సోమరాజు, సతీశ్, కల్యాణ్ పాల్గొన్నారు.



ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం



చర్ల : తాలిపేరు నుంచి నీటి విడుదల

### తాలిపేరు 22 గేట్లు ఓపెన్

చర్ల, ఆగస్టు 31 : ఎగువ ప్రాంతం ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కురుస్తున్న వర్షానికి తాలిపేరు ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతున్నది. దీంతో శనివారం 22 గేట్లు తెరిచి 54,284 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఏడు గేట్లు పూర్తిగా.. 15 గేట్లు నాలుగు అడుగుల మేర ఎత్తినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 74 మీటర్లు కాగా.. ప్రస్తుతం 71.62 మీటర్లుగా ఉంది.



కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

# ఒకటే వాన

- రెండ్రోజులుగా ఆగకుండా కురుస్తున్న భారీ వర్షం
- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో స్తంభించిన జనజీవనం
- పొంగుతున్న వాగులు.. వంకలు
- పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు
- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- భద్రాద్రి జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 31 : భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో రెండ్రోజులుగా ఆగకుండా భారీ వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రంతా వదలకుండా వాన పడడంతో జనజీవనం స్తంభించింది. వరద భారీగా చేరడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చాలా చోట్ల చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. రెండు జిల్లాల్లో శనివారం రోజంతా ముసురుకుంది. భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, అశ్వారావుపేట, ఇల్లెందు, భద్రాచలం, చర్ల తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు భారీగా వరద చేరింది. మూడు గేట్లు ఎత్తి నీరు దిగువకు వదిలారు. రాత్రికి వరద పెరిగితే మళ్లీ గేట్లు ఎత్తే అవకాశం ఉంది. చర్ల మండలం తాలిపేరులో 39 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారు. 12 గేట్లు తీయడంతో భారీగా వరద కింది ప్రాంతాలకు ప్రవహిస్తున్నది.



చుంచుపల్లి : వర్షపునీటితో నిండిపోయిన పెనగడప పెద్దచెరువు

### స్తంభించిన జనజీవనం

రెండ్రోజులుగా కురుస్తున్న ముసురు వానకు జనజీవనం స్తంభించింది. వ్యాపారులు సముదాయాలను మూసివేసుకున్నారు. నిరంతరాయంగా వర్షం కురవడంతో దినసరి కూలీలు, వ్యవసాయ కూలీలు ఇండ్లకే పరిమితమయ్యారు. విద్యాసంస్థలకు సెలవు ఇవ్వకపోవడంతో తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు తడుచుకుంటూ పాఠశాలలకు వెళ్లారు.

### కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు

మరో నాలుగు రోజులు భద్రాద్రి జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంపు ప్రాంతాల్లో ఉండే వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేపల వేటకు, వాగుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. రహదారులపై వాగులు పొంగినప్పుడు దాటవద్దని సూచించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూంతోపాటు 24 గంటలు పర్యవేక్షణ నిమిత్తం 18 మంది సిబ్బందిని కేటాయించారు. 08744-241950 నంబర్ సెప్టెంబర్ 4వ తేదీ సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

### ఖమ్మం జిల్లాలో...

ఖమ్మం నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లావ్యాప్తంగా వరి పొలాలు, పత్తి చేలకు వరుణుడు ప్రాణం పోసినట్లైంది. కాకపోతే పెసర, కొత్తగా వేసిన మిర్చితోట సాగు రైతులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా 64.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మున్నేటిలో వరద ప్రవాహం గంటగంటకూ పెరుగుతున్నది. చాలా చోట్ల చెరువులు, కుంటలు అలుగులు పోస్తున్నాయి. పలుచోట్ల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పల్లిపాడు, ఏన్కూరు, ఖమ్మం టూ బోనకల్ రహదారుల మధ్యలోని రోడ్డుపై వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించాయి. పాలేరు, వైరా, లంకాసాగర్ సాగర్ ప్రాజెక్టులకు వరద వచ్చి చేరింది. ప్రధానంగా ఖమ్మం నుంచి బోనకల్లుకు, బోనకల్లు నుంచి జగ్గయ్యపేటకు వెళ్లే మార్గంలో మున్నేరు ఉధృతంగా ప్రవహించడం వల్ల జగ్గయ్యపేట-బోనకల్లు, బోనకల్లు-ఖమ్మం రోడ్డు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. బేతుపల్లి పెద్దచెరువు, మధిర చెరువు, సత్తుపల్లి, అశ్వారావుపేట, మణుగూరు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు పూర్తి జలకళను సంతరించుకున్నాయి. బోనకల్, వేంసూరు మండలాల్లో చెరువులు అలుగు దశకు చేరుకున్నాయి. పక్షం రోజుల తర్వాత వరుణుడు కరుణించడంతో పునాస, పత్తి పంటలు ప్రాణం పోసుకుంటున్నాయి.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మంత్రులు తుమ్మల, పొంగులేటి**

ఖమ్మం, ఆగస్టు 31 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్లు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎప్పటికప్పుడు జిల్లాలోని పరిస్థితులపై సమీక్షిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్ లైన్ సెంటర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

### కేఎంసీ కార్యాలయంలో హెల్ప్‌లైన్

ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల వల్ల ప్రజలకు ఏమైనా ఇబ్బంది ఉంటే 7901298265 నెంబర్‌కి కాల్ చేయాలని సూచించారు.



చింతకాని : నాగులవంచ వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, ఏఈ



చింతకానిలో తుమ్మలమ్మ వాగు ఉధృతికి నీట మునిగిన వరి పొలాలు



నాగులవంచ-రైల్వే కాలనీలకు ట్రాక్టర్ అడ్డుపెట్టి రాకపోకలు నిలిపి వేసిన అధికారులు

### బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



సత్తుపల్లి టౌన్ : కిష్టారం ఓసీలో చేరిన వర్షపు నీరు

మణుగూరు టౌన్/సత్తుపల్లి టౌన్, ఆగస్టు 31 : మణుగూరు, సత్తుపల్లి మండలాల్లోని సింగరేణి ప్రాంతంలో శనివారం బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలిగింది. మణుగూరు ఓసీ-4లో భారీఎత్తున నీరు నిలవడంతో నీటి మళ్లింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జలగం వెంగళరావు ఓసీలో 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడడంతోపాటు, 1,40,000 క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించే పనులకు, కిష్టారంలో ఓసీలో 5 టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 25 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించే పనులకు ఆటంకం ఏర్పడినట్లు సింగరేణి ప్రాజెక్టు అధికారి నరసింహారావు తెలిపారు.



మధిరలో రోడ్లపై నిలిచిన వర్షపునీరు



దుమ్ముగూడెం ; వర్షానికి పొంగిపొర్లుతున్న గుబ్బలమంగి వాగు



పాల్వంచ పట్టణంలో కురుస్తున్న భారీ వర్షం

# భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- సమీక్షలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, ఆగస్టు 31 : భారీ వర్షాలతో జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలపై శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల దృష్ట్యా జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, సహాయం కోసం ప్రజలు ఫోన్ నెంబర్ 9063211298, టోల్ ఫ్రీ నెంబర్ 1077కు కాల్ చేయవచ్చని తెలిపారు. చెరువులు, వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, మత్తడి ప్రాంతాలను గుర్తించి 24 గంటలు పర్యవేక్షించాలన్నారు. కల్వర్టులు, రోడ్లపై నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో రహదారులను మూసివేయాలని, ప్రజలు దాటకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. నీటి ప్రవాహం వద్ద వలంటీర్లను ఉంచాలని, అవసరం ఉన్న ప్రతిచోట బారికేడ్లు పెట్టాలన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి, జంతు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. శిథిల భవనాల ప్రాంతాల్లో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. దామిని యాప్ గురించి అవగాహన కల్పించడంతోపాటు పిడుగుల నుంచి రక్షణ పొందేలా చైతన్యం తేవాలన్నారు. సమీక్షలో నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, జడ్పీ సీఈవో దీక్ష రైనా, డీఆర్వో ఎం.రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు

**ఐటీడీఏ పీవో రాహుల్**

బూర్గంపహాడ్(భద్రాచలం), ఆగస్టు 31 : ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ, గురుకులాలు, జీపీ పాఠశాలల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళికలపై అంశాలవారీగా డాక్యుమెంటేషన్ రూపంలో తమ రిపోర్టును ఈ నెల 3వ తేదీలోగా భద్రాచలం ఐటీడీఏకు సీల్డ్ కవర్‌లో అందించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి 23 అంశాలపై ఉపాధ్యాయులు విధిగా డాక్యుమెంటేషన్ రూపంలో నివేదిక తయారు చేసి పంపించాలని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు రూపంలో ఉపాధ్యాయ దినోత్సవం నాడు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

## ఓపీఎస్ కోసం ఉపాధ్యాయుల నిరసన

**నేటి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు**



కుంటల్ల పాఠశాలలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి, ఆగస్టు 31 : ఓపీఎస్ సాధన కోసం మండలంలోని కుంటల్ల పాఠశాలలో టీజీఈఏ జేఏసీ ఆధ్వర్యంలో ‘సీపీఎస్, యూపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు’ అనే నినాదంతో ఉపాధ్యాయులు ప్లకార్డులు చేబూని శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీజీటీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఓపీఎస్ సాధనే లక్ష్యంగా జిల్లా కేంద్రంలో టీజీఈఏ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీజీటీటీఎఫ్ బాధ్యులు, సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జోగ రవి, పూల్‌సింగ్, దేవ్‌సింగ్, రాంబాబు, భీముడు, చందూలాల్, రమేశ్, నరేశ్, సుశీల, కల్యాణి, రామకోటేశ్వరి, రామరాజు, రామారావు, మంగిత్యా తదితరులు పాల్గొన్నారు.